# అద్దెగోడలు

-అడపా రామకృష్ణ

"హౌస్ ఓనర్ రంగారావంటే మీరేనా?'' అంటూ ఓ అపరిచిత వ్యక్తి మరొకరితో కలిసి వచ్చి గుమ్మంలో నిలుచున్నాడు. రంగారావు వారి వేష భాషలు గమనించాడు. ఒక చేతిలో సెల్ ఫోను, ఆ చేతి వేళ్లకే మూడు ఉంగరాలు, మరో చేతిలో లావుపాటి డైరీ, కంటికి నల్ల కళ్లద్దాలు, మెడలో గోల్డ్ చెయిను, ఆ ఇద్దరూ ఎంతో అహంభావమున్న వ్యక్తుల్లా కనిపించారు.

"ఆ! అవును. మీరెవరు?'' అనుమానాస్పదంగా అడుగుతూ ఐరన్ గ్రిల్స్‌కున్న గొళ్లెం తీస్తూ లోనికి పిలిచాడు.

"మేం బిల్డింగ్ కాంట్రాక్టర్లం. డెవలప్‌మెంట్ కోసం ఓల్డ్ హౌసెస్ అన్నీ సర్వే చేస్తున్నాం. మీ ఇల్లు చూసి వచ్చాం'' అంటూ ఇంటి వాసాలు లెక్క పెట్టే విధంగా అంతా కలియచూడసాగారు.

రంగారావు ఆత్మాభిమానం దెబ్బతిన్నవాడిలా ముఖం చిట్లించాడు. తనేదో గతి లేక ఇల్లు అమ్మకానికి పిలిచినట్లు, ఆ బిల్డరు బేరసారాలాడుతూ కొనుక్కునే పెద్ద మనిషిలా కనిపించడం రంగారావుకి ఎంతో నామోషీలా తలకొట్టేసినట్లనిపించింది.

"సారీ! డెవలప్‌మెంట్‌కిచ్చే ఉద్దేశం లేదు'' అన్నాడు రంగారావు ఖరాఖండిగా అభ్యంతరం తెలుపుతూ.

"అది కాదు సార్. ఓల్డ్ బిల్డింగ్ కదా. మాకిచ్చారనుకోండి. మీకు మళ్లీ తిరిగి రిచ్‌గా అపార్ట్‌మెంట్స్ కట్టిస్తాం. ఇంకా నగదు రూపంలో కొంత క్యాష్ ముట్టజెబుతాం. చాలామంది అలాగే చేస్తున్నారు. చెప్పడం మా వంతు, ఆ పైన మీ ఇష్టం'' అంటూ చెప్పాలనుకున్న నాలుగు మాటలు చెప్పేసి బయలుదేరడానికి సిద్ధమవుతూ లేచి "మా అడ్రస్సు సెల్ నెంబరున్న విజిటింగ్ కార్డు. కాల్ చేయండి'' అంటూ ఇద్దరూ చెరొక కార్డు అందించి వెళ్లిపోయారు.

అపరిచితులు ఆకస్మాత్తుగా వచ్చి తనకి ఉదారంగా లక్షలు కుమ్మరించాలనుకోవడం రంగారావుకి వింతగా అయోమయంగా తోచింది. ఒళ్లంతా గగుర్పొడిచింది. గదిలోకి వెళ్లేసరికి అప్పటివరకు పిల్లలిద్దరూ చూస్తున్న టీవీ ఛానల్ ప్రోగ్రామ్ సందడి ఆగిపోయింది.

రంగారావు భార్య భాగ్యం వంట గది తలుపులు వేస్తూ కొంగు బిగించుకొని వడివడిగా పెద్ద గదిలోకి వచ్చింది.

అందర్లో కనిపించిన ఆతృతని, అప్పటికే ఆ గదిలో పేరుకుపోయిన నిశ్శబ్దాన్ని భరించలేక కుర్చీలో కూర్చొని నోరు విప్పాడు రంగారావు.

"ఎవరో బిల్డరట. అపార్ట్‌మెంట్ కోసం మనిల్లు అడుగుతున్నాడు. డెవలప్ చేస్తాడట'' అన్నాడు సందిగ్ధంగా ఏ విషయమూ వివరంగా చెప్పకుండా.

"అయితే మీరేమన్నారు'' ఉత్సాహంగా కొడుకు రవి, కూతురు రమ్య పోటీపడుతూ అడిగారు.

"ఏమాత్రం ఇచ్చేది లేదన్నాను. మీ తాతగారు నాకు, కొంత పోర్షను మీ పెద్దనాన్నకు జతచేసి రాశారు. అయినా ఇప్పుడింత అవసరం లేదని చెప్పి పంపించేశాను'' అన్నాడు రంగారావు సావధానంగా.

"అదేంటి డాడీ. మీరు మరీ చాదస్తంగా మాట్లాడుతున్నారు. అవసరం లేదంటారేమిటి?''

అంటూ రవి కొంచెం కఠినమైన గొంతుకతో పలికే సరికి రంగారావు అమాయకంగా భార్య వైపు చూశాడు.

"అబ్బాయన్నది కరెక్టే. అవసరం లేదని ఎలా అనుకుంటున్నారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని మాటిస్తే బాగుంటుంది'' అంది భాగ్యం సౌమ్యంగా.

"డాడీ బిల్డరు మనకేమిస్తామన్నాడో చెప్పండి?'' అని అడిగింది రమ్య, మధ్యలో కల్పించుకుంటూ.

"ఆ! వాళ్లెన్నన్నా చెపుతారు. అపార్ట్‌మెంట్స్‌తో పాటు క్యాష్ కూడా ఇస్తామన్నారు''

"క్యాష్ కొంత కాదు. బాగానే...'' రవి గ్యాప్ పూర్తి చేశాడు. బిల్డరు అన్నమాటలు తను బాగా విన్నాను సుమా అన్నట్లు.

"ఆ మాటే బిల్డరు అన్నప్పుడు, చెరొక మూడు బెడ్ రూమ్స్ మీకు మీ అన్నయ్యకు అడుగుతూ ఆ పైన ఓ ముప్పై లక్షలు కేష్ ఇమ్మంటే సరి'' అంది భాగ్యం పంపకాలు బాగా తెలిసిన వ్యక్తిలా, మరింత గడుసుగా.

"వెరీగుడ్. మమ్మీ చాలా బాగా చెప్పావ్. చెల్లి పెళ్లికి ఓ అపార్ట్‌మెంట్‌తో పాటు పది లక్షలు కట్నం ఆఫర్ చేస్తే ఏ డాక్టరో, ఇంజనీరో వస్తాడు. పెళ్లి కూడా ఘనంగా చేయొచ్చు'' ఎంతో కుతూహలపడుతూ తనకెంతో బాధ్యత ఉన్నవాడిలా అభినయిస్తూ అన్నాడు రవి.

"అన్నయ్యా! డాడీ నీకేం తక్కువ చేయరులే. అమెరికా ప్రయాణానికి పది లక్షలన్నా రెడీ చేస్తారు. అవును కదా డాడీ'' అంటూనే-

"అంతేకాదు, మన స్టాటస్‌కి ఓ కారన్నా లేకపోతే ఎలా'' అంది తన కోరికకు అంతూపొంతూ లేని దానిలా రమ్య.

"అబ్బబ్బ! ఉండడర్రా! ఏమిటి మీ గొంతెమ్మ కోరికలు. మీ డాడీ ఏమంటారో వినండి'' అంది భర్త ఉదాసీన వైఖరిని గమనిస్తూ భార్య.

"పోన్లేవే. వాళ్ల ఆశల్ని కోరికల్ని ఎందుకలా కొట్టిపారేస్తావ్, ఏమో నిజంగానే ఆ బిల్డర్ అలాగే అన్నాడనుకో. అప్పుడు వాళ్లాశించినవి నిజం కాకుండా పోతాయా. మనం మాత్రం సుఖపడక పోతామా?'' అన్నాడు రంగారావు మరింత ఆనందంగా పిల్లల ఆరాటాన్ని, ఆర్భాటాన్ని తనెందుకు ఆటంకపరచాలన్నట్లు.

ఆ మాటకు భాగ్యం ఒకింత ఆశ్చర్యపడినా, అంతలోనే తమాయించుకొని భర్త కోరిక కూడా అదే అయినప్పుడు అంతకన్నా అదృష్టమింకేం ఉంటుందని సంబరపడింది.

రవి, రమ్య వేర్వేరు చోట కూర్చొని ఊహల పల్లకిలో ఊరేగుతూ కలల రాజ్యంలో తమ తమ కోరికలు తీరితే ఎంత ఆనందం పొందొచ్చో ఊహించుకోసాగారు. ఇంత కాలం చాలీచాలని ఓల్డ్ హౌస్ లోనే సర్దుకుంటూ తండ్రి తెచ్చిన అత్తెసరు జీతభత్యాలతో కాలం గడుపుతూ ఈ గృహమే కదా స్వర్గసీమగా తలచి ఎంతో ఆత్మవంచన చేసుకోవడం, స్నేహితులు, బంధువులంతా వారి వారి అంతస్తులకు తగ్గ హుందా, హోదా కనపరుస్తుంటే, అసలీ జన్మకు మనమా స్థాయికి చేరుకుంటామా అని భావిస్తున్న సమయంలో అందరికన్నా ఒక మెట్టు పైకి ఎదిగి, సమవుజ్జీగా హోదా, దర్జా ఒలికించే సదవకాశం ఇప్పటికొచ్చింది. అదే చాలన్నట్లు ఇద్దరు ఆనందడోలికలలూగుతూ కలల పరిష్వంగ్వంలో ఆ రాత్రి ఎలా తెల్లవారిపోయిందో అర్థం

కాలేదు.

ఉదయాన్నే భాగ్యం నిద్ర లేచి పెరటిలోకెళ్లి పూలన్నీ కోస్తూ "అయ్యో! ఇంత చక్కని పూల మొక్కల్ని నిర్దాక్షిణ్యంగా కాంక్రీటులో పూడ్చి పెట్టి పాతరవేస్తారు. తలచుకుంటేనే ఒళ్లు జలదరిస్తోంది' అని క్షణం పాటు మనసు దుఃఖంతో కొట్టుమిట్టాడింది. అదే వేళకు రంగారావు పాత సామానులున్న స్టోరు తెరిచి పాత సమానులన్నీ సర్దుతుంటే-

"ఏం చేస్తారు వీటిని" అంటూ భాగ్యం వచ్చి అడిగింది.

"సెకెండ్ హేండ్‌కిచ్చేస్తే మంచిది కదా, బిల్డరు ఎప్పుడొచ్చి ఇల్లు ఖాళీ చేయమంటాడో మరి" అంటూ కళ్లెగరేశాడు రంగారావు. ఆ మాటకు సన్నగా నవ్వింది భాగ్యం.

ఆ రోజు గడిచిందో లేదో, ఎక్కడెక్కడున్న స్నేహితులు, బంధువులు పరామర్శకు రావడం, మరో పక్క ఫోన్లో పలకరింపులు, "అపార్ట్‌మెంట్ కిచ్చెస్తారటగా, లక్షలే దొరుకుతాయి. మీ పనే బాగుంది" అంటూ ఆ మాటల్లో ఎగతాళో, వెక్కిరింపో, అభినందనో అర్థం కానట్లు పొగడ్తల వర్షం కురిపించసాగారు.


ఆ మర్నాడు బిల్డరొచ్చి తన ప్రపోజల్ మరో మారు గట్టిగా చెప్పి వెళ్లాడు.

మూడో రోజున రంగారావు పంపిన కబురందుకొని అన్నయ్య ఈశ్వర్ భార్యను పిల్లల్ని వెంటపెట్టుకొచ్చాడు. వారి ముఖాల్లో, మాటల్లో ఏదో తేడా, వెలితి కొట్టొచ్చినట్లు కనిపించింది రంగారావుకి. బిల్డరు, అసిస్టెంట్స్ కంట్రాక్టరుతో కలిసి సెటిల్‌మెంట్‌కి వచ్చాడు. ఈశ్వర్ తన తండ్రి రాసిన వీలునామా మరోమారు చదివి పెదవి విరిచాడు. ఏదో లోటు, లోపం కనిపించినట్లు ముఖం వేలాడదీశాడు. తండ్రి బతికి ఉన్నంత కాలం, చివరి క్షణం వరకుచేసిన నిస్వార్థసేవకు రంగారావుకి మూడొంతులు, ఈశ్వర్‌కి మిగిలింది తన ఆస్తి వాటా వేస్తూ వీలునామాలో రాశారు.

ఈశ్వర్ మనస్సంగీకరించలేదు. పెద్ద వాడిగా తనకే మూడు వంతులు వాటా కావాలని పట్టుబట్టాడు. అదే మాటకు భార్యాపిల్లలు కూడా మద్దతు పలికారు. పంతాలు పట్టుదలలు పెరిగాయి. రంగారావు కుటుంబం మాత్రం ఇది అన్యాయమంటూ ధ్వజమెత్తారు. అందరిలో పౌరుషం తారాస్థాయికి చేరింది. ఒకర్నొకరు దుర్భాషలాడుకుంటూ దెప్పి పొడుచుకుంటూ దుయ్యబట్టుకున్నారు. కీచులాటలు, తోపులాటలు ఛీత్కారాలతో వాతావరణం వేడెక్కుతున్న సమయంలో రంగారావు విలయ తాండవం చేసిన వాడిలా ఉగ్రుడై, పిచ్చి కోపంతో గట్టిగా కేకలు పెడుతూ పరిస్థితిని సద్దుమణిగేటట్లు చేశాడు. ఆస్తి కోసం రెండు కుటుంబాలు వీధిన పడటం రంగారావుకెంత మాత్రం మనస్కరించ లేదు. ఓర్పు సహనం కోల్పోయిన వాడిలా ఖంగ్‌మన్న గొంతుకతో "స్టాపిట్. ఏమిటీ న్యూసెన్స్. పరువు మర్యాద లేని వాళ్లల్లా బిహేవ్ చేస్తారేమిటి?" అంటూ ఒక క్షణం ఆగి

"బిల్డర్ గారు దయచేసి ఆ అగ్రిమెంట్ కాగితాల్ని చించి పారేసి, ఇక్కడ్నించి వెళ్లిపొండి. మాకు శాంతి కావాలి. మీరిచ్చే అపార్ట్‌మెంట్లు వద్దు. లక్షలు అసలొద్దు. మాక్కావలసింది ఆత్మీయత, అనురాగం, మీ వద్ద లేవు. ప్లీజ్ వెళ్లిపోండి!" అంటూ అసహనం కోల్పోతున్నట్లు గట్టిగా అన్నాడు. ఊపిరి స్తంభించిందా అన్నట్లు నిశ్శబ్దం చోటుచేసుకుంది.

బిల్డరు అందరి వంక చూశాడు. "సార్? మీర



## ప్రజాస్వామ్యం అంటే?

న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాలిప్పుడు స్వతంత్ర దేశాలైనా వాళ్ళ మౌలిక పరిపాలకు రాలిగా ఇంకా ఎలిజిబెత్ రాణి ఉండడం ఒక సంప్రదాయం అయిపోయింది. అంటే ఆవిడ నియమించిన అధికారి ఒకడు ఆయా దేశాల్లో ఫిగర్ హెడ్‌గా ఉంటాడు. డేమ్ సిల్వియా కార్ట్ వైట్ అనే ఆయన ప్రస్తుతం న్యూజిలాండ్ గవర్నర్ జనరల్‌గా వుంటున్నాడు. రాజుల తరఫున పని చేసేవారికి కొన్ని హంగులు, ఆర్భాటాలు తప్పనిసరిగా వుంటుంటాయి. అమెరికా కప్ అనే ఆట గెలిచినందుకు ఆ గవర్నర్ జనరల్ రాజధాని నగరం ఆక్లాండ్‌లోని గవర్నమెంట్ హౌస్‌లో ఒక ఘనమైన పార్టీ ఏర్పాటు చేసాడు. ఆహ్వానితులు వెయ్యిమందిలో దేశ ప్రధాని హెవెన్ క్లార్క్ కూడా ఉన్నాడు. అయితే చిక్కంతా ఎక్కడ వచ్చిందంటే గవర్నరల్ జనరల్ పార్టీకి ఆహ్వానింపబడని వాళ్ళు కూడా కొందరు రావడంతో పార్టీ రొద కాస్త శృతిమించింది. న్యూజిలాండ్‌లో వాతావరణ కాలుష్యం మీద కఠినమైన చట్టాలున్నాయి. అందులో ధ్వని కాలుష్యం కూడా ఒకటి. 'గవర్నర్ జనరల్‌గారి పార్టీ హోరు ఎక్కువైంది. యాక్షన్ తీసుకోండి' అని పోలీసులకి రిపోర్టిచ్చారు ఆ వీధిలోని నాగరికులు. అక్కడ దేశ ప్రధాని ఉన్నారని అయినా సంశయించకుండా 'ఖబడ్దార్' అని గవర్నర్ జనరల్‌ని హెచ్చరించారుట పార్టీ హాల్లోకి చొచ్చుకువచ్చిన పోలీసు అధికారులు. ప్రజాస్వామ్యమంటే అది. మన దేశంలో ప్రజల గురించి పట్టించుకోకుండా ప్రజలకి దూరంగా వుండేవాళ్ళే ప్రజా ప్రతినిధులు. ఇది మన ప్రజాస్వామ్యం!

**–తటవర్తి రామచంద్రరావు**




న్నది నిజమే కావొచ్చు. ఎవరి వాటా వారు పంచుకోనంత కాలం మీ మధ్య ఈ గొడవలు, మనస్పర్థలు ఇలాగే ఉండిపోతాయి. ఆలోచించండి'' అన్నాడు బిల్డరు ధైర్యంగా.

"బాగా చెప్పారు. ఇంతకాలం మమతలు, మమకారాలు, బంధుప్రీతి మాలో ఉన్నాయని అపోహపడ్డాను. నరనరాల్లో స్వార్థం, అసమానతలు మాలో ఎంతగా పేరుకుపోయాయో చూశారు కదా! మమ్మల్నిక వదిలేయండి!'' నిరాశ నిస్పృహలతో కృంగిపోయినవాడిలా అన్నాడు.

"అది కాదు సార్. ఇంత విలువైన ఆస్తిని ఎందుకూ కొరగాకుండా, ఎవరూ అనుభవించకుండా వృధాగా ఉంచడంలో అర్థం లేదు'' అన్నాడు బిల్డరు నిర్మోహమాటంగా రంగారావుని ఏదో విధంగా తన వైపు తిప్పుకోవాలని ప్రయత్నిస్తూ.

"అది మా సొంత విషయం. మీ జోక్యం మాకక్కర్లేదు. ఐకమత్యంతో మసలుకోవలసిన మా జీవితాలు వైషమ్యాలతో చిన్నాభిన్నం కావడం నేను సహించలేను. మా ఆస్తి విలువ పెరిగేదే కానీ తరిగేది కాదు. గోరంత ఆస్తి ఉన్న మాకు కొండంత అహంభావముందని అర్థమైంది. ఈ అవమానం చాలదా?'' రంగారావు మాటల్లో ఆవేదన, బాధ, అసంతృప్తి అన్నీ మిళితమై ఒక్కసారి ఉప్పెనలా బయటికి తన్నుకురావడంతో బిల్డరుకు నోటి మాట రాక ఖిన్నుడై పోయాడు.

ఈశ్వర్ కళ్లల్లో నిప్పులు పోసుకున్నవాడిలా మండిపడ్డాడు.

"మీ హితబోధలు ఇక ఆపి అసలు విషయానికి రండి. కాల యాపనతో పనులు జరగవు. ఈ రోజే ఇప్పుడే ఏదో తేలిపోవాలి. ఇంతవరకొచ్చాక నేనిక వెనకాడేది లేదు'' అంటూ ఈశ్వర్ విరుచుకుపడ్డాడు.

ఈశ్వర్ మాటలకి రంగారావు గుండె చురకత్తులతో చీల్చినట్లయింది. రక్తం నవనాడుల్లో పోటెత్తినట్లు ఊగిపోయాడు. తీవ్రమైన కంఠస్వరంతో ఈశ్వర్ అన్నయ్యపై ధ్వజమెత్తాడు.

"పెద్దవాడివి, రక్తసంబంధానికి విలువనిస్తావనుకున్నాను. నీక్కావల్సింది ఆస్తులు అంతస్తులే గానీ ప్రేమ, అభిమానాలు, బంధుత్వంలో ఉన్న తీయదనం అక్కర్లేదు. అవి లేని ఈ ఓల్డ్ హౌస్‌లో నువ్వుండగలవేమో గానీ నేనుండలేను నాకు మనుషుల్లో మమత, మమకారం కావాలి గానీ క్షుద్రమైన ఆలోచనలు, అహంకారాలు కాదు. నీకిష్టమొచ్చినంత కాలం ఈ ఇంట్లోనే ఉండు. ఈ ఇల్లు ఇలాగే ఉండనీ అమ్మానాన్నల స్మృతి అంతవేగంగా చెరిగిపోకూడదు'' అంటూ గద్గద స్వరంతో, రెండు కళ్లల్లో కన్నీటిని నింపుకుంటూ ఓల్డ్ హౌస్ డాక్యుమెంట్స్‌ని అన్నయ్య చేతిలోకి కుక్కి, విసురుగా ఒక్క ఉదుటున లోపలికెళ్తూ ఆగి నిశ్చేష్టులై చూస్తున్న తన కుటుంబ సభ్యులతో అన్నాడు. "భాగ్యం, రవి, రమ్యా పదండి. మనం వెళ్లిపోదాం'' దృఢనిశ్చయంతో తీవిగా పలికాడు.

ఆ పలుకులకి బిల్డరు గతుక్కుమన్నాడు.

ఏదో జరగకూడనిది జరిగిపోతున్నట్లుగా కలవరపడ్డారు బిల్డరు. అసిస్టెంట్ కంట్రాక్టరుతో సహా.

అకస్మాత్తుగా బిల్డరు తన చోటు నుండి కదిలి రంగారావు దగ్గరికెళ్లి చేతులు పట్టుకున్నాడు.

ఈ హఠాత్సంఘటనకి రంగారావు నివ్వెరపోయాడు. కోపాన్ని దిగమ్రింగుకొని ప్రశ్నార్థకంగా చూశాడు.

"క్షమించాలి రంగారావు గారు. మీకో నిజం చెప్పాలి'' అంటూ సందిగ్ధంగా పలికాడు.

"చెప్పండి. ఏమిటది?''

"ఇక్కడికి రాకముందు మిమ్మల్ని కలవకముందే మీ అన్నయ్య ఈశ్వర్‌గార్ని కలిశాం''

"కలిస్తే...''

"వీలునామా గురించి తెలుసుకున్నాం''

"అయితే...''

"మీ మధ్య మనస్పర్థలు సృష్టిస్తే కుటుంబాలు విడిపోతే, అప్పుడు అతి తక్కువ డబ్బుతో ఈ ఇంటిని వశపరచుకోవచ్చు. మా పని సులువవుతుందనుకున్నాం. కానీ మా వ్యూహాలన్నీ తలక్రిందులయ్యాయి. మీరెంతో ఔదార్యంతో రక్తసంబంధానికి విలువనిస్తూ ఈ ఇంటిని అన్నయ్యకే అప్పజెపుతూ ఇల్లు విడిచి వెళ్లిపోతారనుకోలేదు. మీరు కలసి ఉంటేనే ఈ ఒప్పందం జరుగుతుంది. అయినా సమయం మించిపోయింది. బిల్డర్‌గా మా స్వార్థమే చూసుకున్నాం. మీ అనుబంధాలకి అడ్డుగోడలు కట్టాం గానీ అపార్ట్‌మెంట్స్ కట్టలేమని తెలిసింది. మరెప్పుడూ మీ జోలికి రాము. రెండు కుటుంబాలు కలిసి హాయిగా ఉండండి'' అంటూ మరో మాటకి తావివ్వకుండా బిల్డరు, అసిస్టెంట్ కాంట్రాక్టర్ అవమానభారంతో తలవంచుకొని గుమ్మం దిగి వెళ్లిపోయారు.

రంగారావుతో పాటు అక్కడున్న వారంతా ఆశ్చర్యచకితులై, నిర్ఘాంతపోయి ఒకర్నొకరు చూసుకుంటూ జరిగినదానికి సిగ్గుపడుతూ చేతులు ముందుకు చాచి ఆప్యాయతకు, అనుబంధాలకు ఆహ్వానం పలికారు.

★